క్లుప్తంగా

మండల స్థాయి సమీక్షా సమావేశం



దుగ్గిరాల: పలు అభివృద్ధి పనులుపై దుగ్గిరాల మండలంలోని గ్రామ కార్యదర్శిలకు మండల స్థాయి సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. దుగ్గిరాల మండల కార్యాలయంలోని సమావేశ మందిరంలో పీ–4 బంగారు కుటుంబాలు, హౌసింగ్ పనులపై సమీక్షను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా పంచాయతీ అధికారి కె.సాయి కుమార్.. గ్రామ, మండల అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

కార్మికుల పనితీరుపై ఆకస్మిక తనిఖీ



దుగ్గిరాల: పారిశుద్ధ్య కార్మికులు ఏవిధంగా ప్రతి ఇంటి నుంచి నేరుగా గార్బేజ్ సేకరిస్తున్నారు అనే విషయంపై జిల్లా పంచాయతీ అధికారి కె.సాయి కుమార్ ఆకస్మిక తనిఖీని నిర్వహించారు. బుధవారం కంఠంరాజు కొండూరు గ్రామంలో ఆయన కార్మికుల పనితీరును పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో కె.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో కె.జె. నెహ్రూ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలి

తాడేపల్లి రూరల్: విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలని తాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాతిరెడ్డి సూచించారు. బుధవారం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ విమల్ కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థి దశలో ఇతర వ్యాపకాలపై దృష్టి మళ్లితే భవిష్యత్తు అంధకారం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీని వినియోగించుకోవాలి



తాడేపల్లి రూరల్: డ్రోన్ టెక్నాలజీని వినియోగించుకుని వ్యవసాయ రంగంలో మార్పులకు శ్రీకారం చుట్టాలని టీడీపీ మండల అధ్యక్షులు దాసరి కృష్ణ అన్నారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో రైతుమిత్ర గ్రూప్ సభ్యులు ధనేకుల వేణు, ధనేకుల రామ్ ప్రసాద్‌లకు 80 శాతం సబ్సిడీపై డ్రోన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో డ్రోన్ వినియోగంతో సమయం, డబ్బు ఆదా అవుతుందని వివరించారు. కార్యక్రమంలో చిర్రావూరు గ్రామ అధ్యక్షులు కాసరగడ్డ శ్రీనివాసులు, మార్కెట్ యార్డు డైరెక్టర్ వీరిశెట్టి శ్రీనివాసరావు, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు అంకం కాళీకృష్ణ, ఏఈవోలు రమేష్ బాబు, పావని, డ్రోగో సంస్థ ప్రతినిధులు పృథ్వీరాజ్, రైతులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంపై కేసు

ఫిరంగిపురం: మండల పరిధి బేతపూడి గ్రామంలోని హరికార్తికేయ మద్యం దుకాణంలో అధిక రేట్లకు మద్యం విక్రయిస్తున్నారంటూ బుధవారం ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ జి.యశోద తెలిపారు. సిబ్బందితో తనిఖీలు చేసి బాటిల్‌పై 10 రూపాయలు అధికంగా అమ్ముతున్నారంటూ కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు తెలిపినట్లు ఆమె పేర్కొన్నారు.

రైతులు పంటల బీమా చేయించుకోవాలి



దుగ్గిరాల: రైతులందరూ తప్పని సరిగా పంట బీమా నమోదు చేయించుకోవాలని.. దానిద్వారా పంట నష్టపరిహారం లభిస్తుందని ఏవో ఆర్.విజయబాబు అన్నారు. బుధవారం చింతలపూడి గ్రామంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన రైతులతో మాట్లాడారు. బీమా నమోదు చేయించుకుంటే పంట నష్టాల నుంచి రైతులు తేరుకోవచ్చునని ఆయన తెలిపారు.

కంటిపాపలా దూడల సంరక్షణ

- పుట్టిన దూడకు ముర్రుపాలు పట్టించాలి
- పశువుల్లో పరిశుభ్రత అవసరం
- సూచనలు పాటించాలంటున్న పశువైద్య నిపుణులు



దూడను పరిశీలిస్తున్న పశువైద్యులు(ఫైల్)

తాడేపల్లి రూరల్: దూడలకు బలవర్థక ఆహారం ఇస్తే బలీయమైన పశువులుగా ఎదుగుతాయి. ఆవులు, గేదెల పాడుగులో పాల సేకరణ చాలా మంది అధిక స్థాయిలో చేస్తుంటారు. దీనివల్ల దూడల్లో వ్యాధి నిరోధక శక్తి లోపించి నీరసిస్తుంటాయి. సక్రమంగా పోషించకపోతే 10 శాతం వరకు దూడల్లో మరణాలు చోటుచేసుకుంటాయి. పుట్టిన ప్రతి దూడను ఆరు నెలలలోపు పశువైద్యాధికారిని సంప్రదించి, చెవి పోగు వేయించి, రిజిష్టర్ చేయించాలి. దూడలు బలంగా ఉండాలంటే ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో పశువైద్యులు తెలియజేశారు.

ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి..

పుట్టిన దూడలకు తొలివారం వరకు తల్లి పశువు నుంచి రెండు పూటలా ముర్రుపాలు పట్టించాలి. ఇటువంటి పాలు తాగించడంతో దూడల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఈ పాలు కూడా పుట్టిన మొదటి 8–12 గంటల్లోపు పట్టిస్తే, అందులో ఉండే రోగ నిరోధక శక్తి దూడలకు కూడా చేరుతుంది. తద్వారా వ్యాధులు అంత త్వరగా దరిచేరవు. దూడలూ ఆరోగ్యంగా ఉంటాయి. కొందరు తల్లి పశువు నుంచి పాలు మొత్తం తీయడంతో, దూడలకు పాలు చాలక నీరసించిపోతాయి. పశు పెంపకం దారులు ఈ విషయాన్ని గుర్తించి దూడలకు కావాల్సినన్ని పాలు వదిలేయాలి. దూడలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఒక్కోసారి అవి మరణించవచ్చు.

దూడలకు సోకే వ్యాధులు..

బ్యాక్టీరియా, వైరస్‌ల ద్వారా ఊపిరితిత్తుల వ్యాధి సోకుతుంది. షెడ్లలో తేమ ఎక్కువగా ఉండడం, చలిగాలుల నుంచి సరైన రక్షణ లేకపోవడంతో ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ వ్యాధి సోకిన దూడలకు జ్వరం వచ్చి, శ్వాస ఇబ్బందికరంగా ఉంటుంది. ఆకలి మందగిస్తుంది. కళ్లు, ముక్కు నుంచి నీరు, కఫం వస్తుంది. దూడలు చనిపోయే అవకాశం కూడా ఉంది. చికిత్సకు పశుశాలలను శుభ్రంగా ఉంచాలి. సల్ఫాతో పాటు లింకోమైసిన్ లాంటి యాంటీ బయాటిక్స్‌ను, ఐవీ ఫ్లూయిడ్స్‌ను వైద్యుని సలహాతో వాడాలి.

మరిన్ని వ్యాధులు సోకే అవకాశం..

దూడ బొడ్డు సంచికి సూక్ష్మ జీవులు ఆశించడంతో కీళ్ల జబ్బు.. బొడ్డు వాపు వ్యాధి సోకుతుంది. బొడ్డు నరం సరిగా వేరు చేయకపోవడం, కత్తిరించడంలో అజాగ్రత్తలతో ఈ వ్యాధి సోకుతుంది. కాబట్టి బొడ్డు ఊడే వరకు పరిశుభ్రమైన స్థలంలో దూడను ఉంచాలి. కొన్ని రకాల బ్యాక్టీరియాలతో లేగ దూడలకు తెల్లపారుడు వ్యాధి సోకుతుంది. దూడలు విపరీతంగా తెల్లగా పారుతాయి. చికిత్సకు పశువైద్యుని సలహాతో సల్ఫా యాంటీ బయాటిక్స్, ఐవీ ఫ్లూయిడ్స్ ఇవ్వాలి. ఎక్కువ పాలు తాగించడంతో సూక్ష్మ జీవులు కోక్సిడియా ఆశించి రక్త విరేచనాలు అవుతాయి. పశుశాలను శుభ్రంగా ఉంచడంతో పాటు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి.

అపరిశుభ్ర పాత్రలు, షెడ్లలో తడి, బురద ఉండడం, ఆహారాన్ని పరిమితికి మించి పెట్టడంతో అతిసార వ్యాధి సోకుతుంది. దుర్వాసనతో కూడిన నీళ్ల విరేచనాలతో దూడలు నీరసిస్తాయి. 1–3 వారాల దూడలు ఈ వ్యాధికి లోనవుతాయి. ఈ సమయంలో వైద్యుడిని సంప్రదించాలి.

టీకాలు తప్పని సరి..



దూడ పుట్టిన ఒకటో రోజు ధనుర్వాతం ఇంజెక్షన్ ఇప్పించాలి. నాలుగో రోజు ప్రిపలిన్ ఇంజెక్షన్, విటమిన్–ఏ ఇవ్వాలి. నాలుగో మాసంలో సంకరజాతి దూడలకు థైలేరియా వ్యాధి నిరోధక టీకా ఇప్పించాలి. ఆరో మాసంలో గొంతువాపు, జబ్బవాపు టీకాలు వేయించాలి. ప్రతి పెయ్యి దూడకు కూడా 4–8 నెలల్లోపు బ్రూసెల్లోసిస్ టీకాను వేయించాలి. ప్రతి ఆరు నెలలకు గాళ్ల వ్యాధి నిరోధక టీకాలు కూడా వేయాలి. ఆయా టీకాల కోసం పాడిరైతులు సమీపంలోని పశువైద్యశాలలను సంప్రదించాలి.

– డాక్టర్ నరేంద్రరెడ్డి, పశువైద్యులు, తాడేపల్లి

ప్రచారం తప్ప పథకాలు ఏవీ!



కార్యక్రమంలో క్యూఆర్ కోడ్‌ను చూపిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసాలు వివరిద్దాం
- కార్యకర్తలకు అండగా వైఎస్సార్‌సీపీ ఉంటుంది
- మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లి రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రచార యావ తప్ప ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన సంక్షేమ పథకాల హామీలు అమలు చేయాలనే ఆలోచన లేదని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి (డీవీఆర్) అన్నారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ఆర్‌సీఎం చర్చి వద్ద 17వ వార్డులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వేమారెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అమలు చేసిన హామీలను గుర్తుచేశారు. సీఎం చంద్రబాబు, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తుంటే వైఎస్సార్‌సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. అయినప్పటికీ మన ఆడపడుచులు ఇంటింటికి తిరుగుతున్న కూటమి నాయకులను నిలదీస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు వేల్పు ఎలీషా, ప్రధాన కార్యదర్శులు చిన్నబోతుల దుర్గారావు, చిట్టిమళ్ల స్నేహ సంధ్య, పట్టణ మహిళా అధ్యక్షురాలు దర్శి విజయశ్రీ, మంగళగిరి నియోజకవర్గ రైట్ ఇన్ఫర్మేషన్ అధ్యక్షులు ఉండ్రు కల్యాణ్, తాడేపల్లి పట్టణ సోషల్ మీడియా అధ్యక్షులు వికాస్, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ–4 కార్యక్రమం

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ నాగలక్ష్మీ

మేడికొండూరు: ప్రభుత్వం, దాతలు, ప్రజల భాగస్వామ్యంతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని.. అందుకు రాష్ట్ర ప్రభుత్వం పీ–4 కార్యక్రమాన్ని ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ తెలిపారు. బుధవారం మేడికొండూరులోని వేణుగోపాల స్వామివారి దేవస్థానం కల్యాణ మండపంలో జరిగిన పీ–4 కార్యక్రమం గ్రామ సభ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మీ మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర విజన్ 2047 సాధన దిశగా నిర్దేశించుకున్న లక్ష్యాలలో పేదరిక నిర్మూలన ముఖ్యమైన అంశమని తెలిపారు. గ్రామ సభ అనంతరం ఆమె పలు సమస్యలను స్థానికుల నుంచి అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో జ్యోతిబసు, సీపీవో శేషశ్రీ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి కె.నాగేశ్వరరావు, జిల్లా సహకార శాఖ అధికారి వీరాచారి, ఎంపీడీవో ప్రభాకర రావు, తహసీల్దారు హరిబాబు, ఈవోపీఆర్డీ పూర్ణ శంకర రావు, సర్పంచి నాగమణి, గ్రామ పెద్దలు పాముల పాటి శివ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు త్వరలోనే న్యాయం జరగనుంది



దీక్షలకు మద్దతు తెలియజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు త్వరలోనే న్యాయం జరుగుతుందని.. న్యాయస్థానంపై గౌరవం ఉందని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు అన్నారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు 232వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కె.స్టీవెన్, ఆదినారాయణలతో కలిసి సందర్శించి కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా స్టీవెన్ సిమెంట్ ఫ్యాక్టరీ కేసు విచారణపై అమరావతి హైకోర్టులో జరిగిన విచారణను కార్మికులకు వివరించారు. కేసు రెండు వారాలకు వాయిదా వేశారని.. త్వరలోనే ముగింపునకు రానున్నదని తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు రిబ్కా, కొండ వెంకటరమణ, లక్ష్మి, రోజా, అంకమ్మ, గురవయ్య, ఖాసిం, పిచ్చయ్య, హగ్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మార్జిన్ లేక అవస్థలు



రోడ్డు పక్కకు ఒరిగిన పాఠశాల బస్సు

దుగ్గిరాల: దుగ్గిరాలలోని ఈమని గ్రామంలో తారు రోడ్డు వేశారు కానీ.. పక్కన మార్జిన్ మాత్రం నామమాత్రంగా చేసి వదిలేశారు. గత మూడు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు తారు రోడ్డు మార్జిన్ గట్టిగా లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం సాయంత్ర ఓ పాఠశాల బస్సు మార్జిన్ సరిగా లేకపోవడంతో రోడ్డు పక్కకు ఒరిగిపోయింది. నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు వదులుతున్న అధికారులు ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా నాణ్యతా ప్రమాణాలను పెంచాలని పలువురు కోరుతున్నారు.

పసుపు బాధిత రైతుల బాండ్లు పరిశీలన



బాండ్లను పరిశీలిస్తున్న యార్డు సెక్రెటరీ సుబ్బారావు

దుగ్గిరాల: పసుపు రైతు బాధితుల నగదు పంపిణీ బాండ్లు, రైతు అకౌంట్ల పరిశీలన కార్యక్రమం మూడో రోజు కొనసాగింది. బుధవారం తెనాలి సబ్ కలెక్టరు కార్యాలయం కేంద్రంగా సంబంధిత రైతుల నుంచి వారి వివరాలను ఉన్నత శ్రేణి కార్యదర్శి జె.వి. సుబ్బారావు పరిశీలించారు. వారి ఖాతాలను నిర్ధారించిన తర్వాతనే రైతులకు నగదును జమ చేస్తున్నారు. మొత్తం 346 రైతులు ఉండగా.. 322 మంది రైతులకు ప్రక్రియ పూర్తి చేసి వారికి నగదు అందించామని, మిగిలిన రైతులు కూడా త్వరగా వచ్చి నష్టపరిహారం తీసుకోవాలని ఆయన తెలిపారు. ప్రక్రియను సబ్ కలెక్టరు వి.సంజనా సింహా పర్యవేక్షిస్తున్నారు.

పీఎస్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



మహిళా హోంగార్డు సత్యకు రివార్డు అందజేస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

తాడికొండ: తాడికొండ పోలీస్‌స్టేషన్‌ను గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలానికి ముఖద్వార రహదారులైన కంతేరు అడ్డరోడ్డు, పొన్నెకల్లు, లాం, అమరావతి రోడ్డులను సందర్శించి సరిహద్దులను తెలుసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సిబ్బందితో మమేకమై వారి బాగోగులు, ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జరిగిన లోక్ అదాలత్‌లో 53 కేసులను రాజీ చేయడంలో చొరవ చూపిన హోమ్‌గార్డు సత్యను ప్రత్యేకంగా అభినందించి రివార్డును అందజేశారు. కార్యక్రమంలో ఆయన వెంట సీఐ కె.వాసు, ఏఎస్ఐ సాంబశివరావు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

24వ మహాసభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న చిన్ని తిరుపతయ్య

తాడేపల్లి రూరల్: సీపీఐ మంగళగిరి నియోజకవర్గ 24వ మహాసభను జయప్రదం చేయాలని పార్టీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పిలుపునిచ్చారు. బుధవారం వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరుపతయ్య మాట్లాడారు. ఈనెల 25వ తేదీన మంగళగిరిలోని తెనాలి రోడ్డులో గల మార్కండేయ కల్యాణ మండపంలో సీపీఐ మంగళగిరి నియోజకవర్గ 24వ మహాసభను నిర్వహించనున్నామని తెలిపారు. ఈ మహాసభలకు రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్‌లు హాజరు కానున్నారని అన్నారు. సమావేశంలో నియోజకవర్గ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బీజామృతంతో విత్తన శుద్ధి తప్పనిసరి



రైతులకు వివరిస్తున్న ఏవో వాసంతి

ఫిరంగిపురం: వరినారు పోసే ముందుగా బీజామృతంతో విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని ఏవో వాసంతి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు, 113.తాళ్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసంతి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఎకరానికి 25 కిలోల నాణ్యమైన వరి విత్తనాలు విత్తన శుద్ధి చేసుకుని వేసుకోవాలని చెప్పారు. వాటిని రెండు రకాల పద్ధతుల ద్వారా చేయవచ్చని.. ఒకటి రసాయనాలతో, రెండోది ప్రకృతి సిద్ధమైన బీజామృతంతో శుద్ధి చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హకీం, రైతులు పాల్గొన్నారు.

నిర్మానుష ప్రాంతంలో బైక్ చక్రాలు తొలగింపు



రైల్వేహాల్ట్ సమీపంలో ముళ్లపొదల్లో చక్రాలు లేని బైక్

పెదకాకాని: చాకచక్యంగా బైక్‌లు కాజేస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుంది. పెదకాకాని పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలువురి బైక్‌లు మాయం అవుతున్నప్పటికీ కొన్ని మాత్రమే కేసులు నమోదవుతున్నాయి. పెదకాకాని రైల్వేహాల్ట్ సమీపంలో ఉన్న నిర్మానుష ప్రాంతంలో కొత్త ద్విచక్ర వాహనం నిలిపి ఉంది. ఆ బైక్‌కు రెండు చక్రాలు, బ్యాటరీ, పలు స్పేర్‌స్పార్ట్‌లు తొలగించి ఉన్నాయి. ఈ బైక్‌ను అనకాపల్లి ప్రాంతం నుంచి దొంగిలించి పెదకాకాని ఏరియాకు తీసుకు వచ్చి ముళ్ల పొదల్లో వదిలేశారని.. బైక్‌లోని విలువైన సామాన్లను తొలగించి తీసుకు వెళ్లి ఉంటారని సమాచారం. అలానే నెల రోజుల క్రితం పెదకాకాని రైల్వేహాల్ట్ వద్ద పెట్టి వెళ్లిన బైక్ ఇప్పటికీ అలానే ఉంది. నాలుగు నెలల కిందట వెనిగండ్ల, అగతవరప్పాడు గ్రామాల మధ్య నిర్మానుష ప్రదేశంలో మరో బైక్‌కు గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లారు.

విద్యతో పాటు కళల్లోనూ రాణించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ పీఆర్కే ప్రసాద్

పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం పర్ఫామెన్స్ అండ్ ఫైన్ ఆర్ట్స్ నందలి డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్ఫామెన్స్ థియేటర్‌లో బుధవారం విద్యార్థి కళాకారులకు ఆర్ట్ ఎప్రిసియేషన్, స్టడీ ఆఫ్ బ్యూటీ అన్న అంశంపై ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ సంగీత నృత్య నాటక కళలకు సంబంధించిన విద్యార్థి కళాకారులందరూ భాగస్వామ్యం పొందారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పీఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ.. కళ, వాటి ఉపయోగం, విలువలు, వివిధ రకాలైనటువంటి లక్షణాల గురించి వివరించారు. రంగస్థలం మాట్లాడుతూ.. పాత్ర లోతులను అంచనా వేసుకుని పాత్రలతో మాట్లాడడం, పాత్రులు ఆశించిన విధంగా ఆ సౌందర్య వివరాలను ఆకలింపు చేసుకుని పాత్ర పోషించడంలో సౌందర్య కళ చాలా ముఖ్యమైందన్నారు. ఈ సమావేశానికి సంగీత కళల శాఖ అధిపతి డాక్టర్ మంజుల, మత్స్యశాఖ అధ్యాపకులు కాశయ్య, విశ్వనాథ్‌లు పాల్గొని విద్యార్థి కళాకారులకు ప్రోత్సాహాన్ని అందించారు.

ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలి



ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నూతనంగా నిర్మాణం చేసే బహుళ అంతస్తు భవనాలు తగిన డ్రైనేజీ సిస్టం ఏర్పాటు చేసుకుని.. నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలని, లేకుంటే మార్టిగేజ్ మంజూరు చేయమని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం ఆయన గోరంట్ల, గాయత్రీ నగర్ ప్రాంతాల్లో ఆక్యుపెన్సి సర్టిఫికెట్‌కి దరఖాస్తు చేసుకున్న భవనాలను పరిశీలించి, డ్రైనేజీ కనెక్షన్ లేని వాటికి మార్టిగేజ్ మంజూరు నిలిపివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాల నిర్మాణాలు జరగాలని అన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. అనంతరం చౌడవరంలోని సీఆర్ కాలనీలో పర్యటించి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, ఎస్ఎస్ ఐజాక్, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉదిత్ ప్రధాన్‌ను వెంటనే శిక్షించాలి



పెదకాకాని(ఏఎన్‌యూ): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఎన్ఎస్‌యూఐ ఒరిస్సా రాష్ట్ర అధ్యక్షుడు ఉదిత్‌ప్రధాన్ దిష్టిబొమ్మ దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వర్సిటీ ఏబీవీపీ ఉపాధ్యక్షుడు హేమంత్‌రామ్ మాట్లాడుతూ.. ఒరిస్సాలో 19 ఏళ్ల యువతిపై అత్యాచారం చేసిన ఎన్ఎస్‌యూఐ ఒరిస్సా రాష్ట్ర అధ్యక్షుడు ఉదిత్ ప్రధాన్‌ను వెంటనే శిక్షించాలని కోరారు. ఎన్ఎస్‌యూని దేశమంతటా బ్యాన్ చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ఎస్‌యూఐ పేరుతో విద్యార్థులపై దాడులు చేయాలని నేర్పిస్తుందా అని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఏబీవీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి సాగులో జాగ్రత్తలు పాటించాలి

పొన్నూరు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా వరి సాగులో తగిన జాగ్రత్తలు పాటించాలని ఏవో ఆర్.వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం మండలంలోని ములుకుదురు, మాచవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ.. వరి వెద సాగు చేసిన పైరులో నీరు నిల్వ చేరకుండా ఉంచాలని సూచించారు. వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

నా క్లయింటు మున్నంగి (లేటు) శివారెడ్డి గారి కుమారుడు మున్నంగి సందీప్ రెడ్డి, క్లస్టర్ విల్లా నెం.1 రాంకీ సీఈఓ ఎంక్లేవ్, ఆంజయ్య నగర్, గచ్చిబౌలి, కె ఏ రంగా రెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం నివాసి గారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

మా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని గుంటూరు జిల్లా, మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఇప్పటం గ్రామ కాపురస్తుడు (లేటు) మున్నంగి రామకృష్ణా రెడ్డి గారి కుమారుడు మున్నంగి బాలకోటిరెడ్డి గారు తనకు పూర్తి హక్కు, అధికారం, స్వాధీనం కలిగిన ఆస్తి అని తన అవసరములకు విక్రయించుటకు చూపగా మా క్లయింటు కొనుగోలు చేయుటకు అంగీకరించి కొంత ద్రవ్యమును అడ్వాన్సుగా ఇచ్చి విక్రయ ఖరారు అగ్రిమెంటు పొంది ఉన్నాడు.

మా క్లయింటు సదరు మున్నంగి బాలకోటి రెడ్డి గారి వద్ద నుండి దిగువ షెడ్యూలు ఆస్తిని విక్రయం పొందుటకు ఎవరికైనను ఏదైనా అభ్యంతరములు కాని, హక్కులు కాని, ఎటువంటి కోర్టు వివాదములు కాని ఏదైనా క్లైములు ఉన్నయెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 10 రోజులలోగా లిఖితపూర్వకముగా మాకు గాని మా క్లయింటుకు గానీ తెలియజేయ వలెను. లేని యెడల షెడ్యూలు ఆస్తి నిర్వివాదమైన ఆస్తి అని భావించి మా క్లయింటు కోరిన విక్రయ ధనమును చెల్లించి సదరు మున్నంగి బాలకోటి రెడ్డి గారి వద్ద నుండి రిజిస్టర్ విక్రయ దస్తావేజును పొందగలరని తదుపరి ఎవ్వరైనా షెడ్యూలు ఆస్తి గురించి ఏదైనా క్లెయిములు కానీ, హక్కు కానీ కోరిన యెడల అవి మా క్లయింటును బద్ధపరచజాలవని యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు

గుంటూరు డి. మంగళగిరి సబ్ డి. యిలకా, మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ఏరియా, తాడేపల్లి మండలం, ఇప్పటం గ్రామ పంచాయితీ ఏరియలో చేరిన ఇప్పటం గ్రామము తాలుకు డి.నెం .107 రు యు. 11.05 సెంట్లు మింజుమలె ఇప్పటం గ్రామ డోర్ నెం.10-1-87 రు, అసెస్మెంటు నెం. 1143084297 రుగా దిగువ హద్దులు లోని య. 0.23 సెంట్లు లేక చ.గ.1113.2 లు స్థిరాస్తి నివేశన స్థలమున్ను, సదరు స్థలములో గల ఆర్.సి.సి డాబాయిల్లు. తూర్పు:- బజారు హద్దు లిం. 92 లు, దక్షిణం:- మున్నంగి సుబ్బారెడ్డి గారి ఆస్తి హద్దు – లిం. 224 లు, పడమర:- బజారు హద్దు లిం. 100 లు, ఉత్తరం:- జొన్నగాని మహాలక్ష్మి, వగైరాల ఆస్తి హద్దు – లిం. 252 లు

మంగళగిరి
తేది: 23-07-2025

ఇనకొల్లు వెంకటేశ్వర్లు, ఎం. బాల సత్యనారాయణరెడ్డి
అడ్వకేట్స్, సెల్: 9440242233, 7337323277
విల్లా నెం.6, ఎస్.ఎస్.ఆర్. విల్లాస్, టిక్‌సాక్స్ రోడ్, తెనాలి ప్లై ఓవర్ దగ్గర, ఎన్. హెచ్-16, మంగళగిరి